www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 22 ఏప్రిల్ 2023

5

ఏలూరు

ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ ఉపవాసాన్ని నిష్ఠతో కఠినంగా దీక్షలను పాటించారని పేర్కొన్నారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక రంజాన్ పండుగ అని తెలిపారు. పవిత్రతకు, త్యాగానికి, మత సామరస్యం, సోదర భావం చాటి చెప్పే పండుగను ముస్లిం సోదరులు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

లారీలు పంపండి..

మహాప్రభో..!

- ఖరీఫ్ పరిస్థితులు పునరావృతం
- మారని పౌరసరఫరాల శాఖ అధికారుల తీరు
- రబీ ధాన్యం రవాణాలో రైతులకు చుక్కలు
- పూళ్ల జాతీయ రహదారిపై ఆందోళనకు దిగిన అన్నదాత
- రైతులు సొమ్ములిస్తే లారీలు పెడతామంటున్న యజమానులు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం కొనుగోలులో పౌర సరఫరాలశాఖ అధికారుల తీరు ఏమాత్రం మారలేదు. ఖరీఫ్‌లో సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకున్నామంటూ నాలుగు రోజుల క్రితం వరకూ అధికారులు ఊదరగొట్టారు. ఖరీఫ్‌లో లారీల సమస్యతో రైతులు ఏవిధంగా బాధపడ్డారో మళ్లీ అదే సమస్య రబీలోనూ రైతులను వెంటాడుతున్న పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లోనూ మూడు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. దాదాపు 70 శాతం వరకూ మాసూళ్లు పూర్తయినట్లు రైతులు చెబుతున్న పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు, నిడమర్రు వంటి అనేక మండలాల్లో పెద్దఎత్తున రైతులు మాసూళ్లు చేసి ధాన్యం రాశులు చేసి ఉంచారు. ఆలస్యంగా గడిచిన ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. అనేక తర్జనభర్జనల తర్వాత ఎకరాకు 92 సంచులు ఇస్తున్నారు. రైతులు సంచులు తీసుకుని ధాన్యం పట్టి సిద్ధంగా ఉంచారు. ధాన్యం సంచుల్లో పట్టి ఐదు రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ ధాన్యం బస్తాలు మిల్లులకు తరలించేందుకు లారీలు మాత్రం రావడం లేదు. దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ముఖ్యంగా ఏలూరు జిల్లాలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఖరీఫ్‌లో ఎదురైన సమస్యలపై పౌరసరఫరాల శాఖాధికారులు ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదని ప్రస్తుత పరిణామాలు చెబుతున్నాయి. పౌరసరఫరాల శాఖాధికారులు సరైన ప్రణాళికలు సిద్ధం చేయకపోవడమే దీనికి ప్రధాన కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. బస్తాల్లో ధాన్యం ఏవిధంగా తరలించాలో తెలీక రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కిరాయి సొమ్ము చెల్లిస్తే లారీలు పెడతామని లారీల యజమానులు చెబుతున్న పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. మిల్లుల దూరాన్ని బట్టి లారీ కిరాయి రూ.తొమ్మిది వేల నుంచి రూ.12 వేలకుపైగా అడుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అంత పెద్దమొత్తంలో కిరాయిలు చెల్లించలేక, అధికారులు లారీలు పంపించకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో కడుపుమండిన రైతులు శుక్రవారం పూళ్ల జాతీయ రహదారిపై ఆందోళనకు దిగి లారీలో పంపించండి మహాప్రభో అంటూ వేడుకున్న పరిస్థితి నెలకొంది. తమ బాధలను అధికారులు దృష్టికి తీసుకెళ్లాలంటూ మీడియాకు లేఖ రూపంలో రైతులు తెలియజేసిన పరిస్థితి నెలకొంది. ఉంగుటూరుతోపాటు చుట్టుపక్కల మండలాలకు కేవలం 70 లారీలు మాత్రమే కేటాయించినట్లు తెలుస్తోంది. ఇవి ఏవిధంగా సరిపోతాయో తెలియక స్థానిక అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. పలు గ్రామాల్లో 90 శాతం మాసూళ్లు పూర్తయిన పరిస్థితి నెలకొంది. అలాంటి గ్రామాలకు కూడా శుక్రవారం ఒక్కలారీ మాత్రమే వెళ్లిన పరిస్థితి కొనసాగింది. లారీల కోసం రైతులు పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు ధాన్యం రవాణాలో ఏర్పడిన లారీల సమస్యను పరిష్కరించాలని రైతులు నెత్తినోరు మొత్తుకుంటున్నారు.

లారీలు పంపాలని పూళ్ల జాతీయ రహదారిపై ఆందోళనకు దిగిన రైతులు

ధాన్యం పట్టి ఐదు రోజులైనా లారీలు రాలేదు

వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, రైతు, పూళ్ల

రబీలో మూడెకరాల్లో వరి సాగు చేశాను. మాసూళ్ళు పూర్తి చేసి పది రోజులైంది. ఈ నెల 17న సంచులు ఇచ్చారు. 40 కిలోల సంచుల్లో 300 సారలు పట్టి ఐదు రోజులు గడిచిపోయింది. ఇప్పటి వరకూ లారీలు రాలేదు. వాతావరణ పరిస్థితులు రోజుకో రకంగా ఉంటున్నాయి. ఏదైనా తేడా వస్తే తీవ్రంగా నష్టపోతాం. వెంటనే లారీలు పంపాలని కోరుతున్నాం.

పట్టిన ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది

కొరపల్లి రాంబాబు, రైతు, పూళ్ల

రబీలో 16 ఎకరాల్లో వరి సాగు చేశాను. 12 ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. ఈ నెల 17న సంచులు ఇవ్వడంతో మూడెకరాల్లో ధాన్యం పట్టాను. ఐదు రోజులు గడుస్తున్నా లారీలు రాకపోవడంతో కళ్లాల్లోనే ధాన్యం ఉండిపోయింది. లారీలు వెంటనే పంపాలని అధికారులను కోరుతున్నాం.

కిరాయి ఇస్తే లారీలు పెడతామంటున్నారు

దూడే కేశవరావు, రైతు, బొమ్మిడి

రబీలో 15 ఎకరాల్లో వరిసాగు చేశాను. ఈ నెల 16న సంచులు ఇవ్వడంతో వెయ్యి సారలు ధాన్యం పట్టాను. దాదాపు ఆరు రోజులు గడుస్తున్నా ఒక్క లారీ రాలేదు. గ్రామంలో పరిస్థితి మొత్తం ఇలానే ఉంది. రైతులు సొమ్ము చెల్లిస్తే లారీలు పెడతామని లారీ యజమానులు చెబుతున్నారు. అంత పెద్దమొత్తంలో కిరాయి చెల్లించాలంటే రైతులు నష్టపోతారు. వెంటనే లారీలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

దోసపాడు భూపోరాటంపై పోలీసుల ఉక్కుపాదం

- మండుటెండలో నడి రోడ్డుపై దళిత మహిళలు ఆందోళన
- అధికారుల హామీతో ఆందోళనకు తాత్కాలిక విరామం
- 29న జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు విచారణ
- కోర్టులోనే ఆధారాలు సమర్పించాలని తహశీల్దార్ సూచన

దళిత మహిళలతో మాట్లాడుతున్న తహశీల్దార్, పోలీసు అధికారులు

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు జిల్లా దెందులూరు మండలం దోసపాడు గ్రామంలో దళితుల భూ పోరాటంపై శుక్రవారం పోలీసులు ఉక్కుపాదం మోపారు. దళితుల పోరు రెండు రోజులుగా ఉధృతంగా సాగుతున్న సంగతి తెలిసిందే. రోజురోజుకీ పోరు ఉధృతం అవుతుండటంతో శుక్రవారం ఉదయం నుంచి జిల్లా అధికారులు ప్రత్యేక పోలీసు బలగాలను రంగంలోకి దించి ఆ ప్రాంతంలో మోహరించారు. చెరువుల్లోకి దళితులను వెళ్లనీయకుండా ప్రత్యేక బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినా మండుటెండను లెక్కచేయకుండా దళిత మహిళలు నడిరోడ్డుపై బైఠాయించి అధికారుల తీరుపై నిరసన తెలిపారు. దీంతో పోలీసులకు, ఆందోళనాకారులకు తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. మాకు న్యాయం జరిగే వరకూ పోరాటం మరింత ఉధృతం చేస్తామని ఆందోళనాకారులు హెచ్చరించారు. దీంతో అధికారులు, పోలీసులు సమస్య తీవ్రతను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి ఆందోళనాకారులతో చర్చలు జరిపారు.

29న జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు విచారణ

ఈ నెల 29న జాయింట్ కలెక్టర్ కోర్టులో ఈ కేసు విచారణకు వస్తుందని, అప్పుడు మీ అందరికీ కోర్టు నుంచి నోటీసులు వస్తాయని, మీ వద్ద ఉన్న ఆధారాలను కోర్టుకు సమర్పించాలని దెందులూరు తహశీల్దార్ ఎన్‌వి.నాంచారయ్య దళితులకు సూచించారు. గత 40 ఏళ్ల క్రితం అసైన్డ్ భూమికి ఎవరికైతే పట్టాలు ఇచ్చారో దానికి సంబంధించిన రికార్డు పాత అడంగళ్లు లో తమ కార్యాలయంలో ఉందని, లబ్ధిదారులు లేనివారు వారికి సంబంధించిన వారసులు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. ఆందోళనకారులు తగిన ఆధారాలతో తహశీల్దారు కార్యాలయానికి వస్తే పాత అడంగళ్ళ ప్రకారం విచారణ నిర్వహించి అర్హులైన వారసులందరికీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పుడు భూములు అనుభవిస్తున్న భూస్వాములు ఆందోళనకారులు పెట్టిన కేసులో స్టే తెచ్చుకున్నారని, మీరు కూడా అలా స్టే తెచ్చుకోవాలని సూచించారు. చట్టప్రకారం కొన్ని ప్రొసీడింగ్స్ ఉంటాయని, వాటి పరిధి దాటి ఎన్ని ఆందోళనలు చేసినా ప్రయోజనం లేదని అన్నారు. ఈ నెల 29న జెసి కోర్టులో విచారణ ఉన్నందున మీ దగ్గర ఉన్న వారసుల ఆధారాలను కోర్టుకు సమర్పించాలని తహశీల్దారు నాంచారయ్య తెలిపారు.

ఆందోళనకు తాత్కాలిక విరామం

తహశీల్దార్ ఎన్‌వి.నాంచారయ్య, పెదవేగి సిఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ లక్ష్మణ్, దెందులూరు ఎస్ఐ వీర్రాజు ఆందోళనాకారులతో చర్చలు జరిపారు. కోర్టు తీర్పు వచ్చే వరకు ఇరుపక్షాలు వివాదాస్పద చెరువులోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆందోళనాకారులు పట్టుబట్టడంతో పోలీసు, రెవెన్యూ అధికారులు అంగీకరించారు. దీనికోసం రెవెన్యూ శాఖ నుంచి ఇద్దరిని, పోలీసు శాఖ నుంచి ఇద్దరిని కాపలాగా నియమిస్తున్నట్లు రెవెన్యూ, పోలీసు అధికారులు తెలిపారు. దీంతో ఆందోళనాకారులు శాంతించారు. ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దళిత మహిళలు చవళ్ల మూడి ఏసుమణి, లలిత, దేవ కృపామణి, గుజ్జెల సౌదామిని, సిహెచ్.యానీ, బొంతు బేబమ్మ, లక్ష్మి, ఘంటసాల పాపాయమ్మ, రమణ పాల్గొన్నారు.

దోసపాడు దళితులకు న్యాయం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు: దోసపాడు పేదలు అసైన్డ్ భూముల కోసం చేస్తున్న పోరు న్యాయబద్ధమైందని, ఆ పోరాటాన్ని అణిచివేయాలని చూస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 9/77 చట్టాన్ని అమలు చేయాలని, సెక్షన్ 24 ప్రకారం పేదలకు న్యాయం చేయాలని కోరారు. దోసపాడు పేదలు సంవత్సరకాలం నుండి అసైన్డ్, సీలింగ్, గయ్యాల భూములు పంచాలని పోరాడుతున్నా ప్రభుత్వం మొద్దునిద్ర పోతుందని విమర్శించారు. దళిత పేదలపై భూస్వాములు దౌర్జన్యానికి పాల్పడుతుంటే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు కట్టి పేదల కన్నీళ్లు తుడిచారే తప్ప నిందితులను అరెస్టు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు చెందిన భూములను పేదలకే పంచాలని కోరారు. భూస్వాములకు తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు సిపిఎం అండగా ఉంటుందని, వారి పక్షాన పోరాటం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రవాణా సౌకర్యం కోసం రోడ్డెక్కిన రైతులు

ధాన్యం తరలింపునకు వాహనాల ఏర్పాటులో అధికారులు విఫలం

ప్రజాశక్తి - భీమడోలు

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతూ పూళ్ల వద్ద జాతీయ రహదారిపై రైతులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించడంతో భీమడోలు పోలీసులు రంగప్రవేశం చేశారు. తహశీల్దార్ షంషుద్దీన్ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ రాస్తారోకో చేస్తున్న రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని జెసికి ఫోన్ చేసి కోరారు. సమస్య పరిష్కారానికి జెసి హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. పూళ్ల సొసైటీ కేంద్రంగా ఈ నెల 17 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఏజెన్సీ ద్వారా ఇంతవరకు 510 టన్నుల ధాన్యం మాత్రమే మిల్లులకు తరలించారు. పదివేల టన్నుల ధాన్యం రైతుల వద్ద నిలబడిపోయింది. రవాణా సౌకర్యం లేని కారణంగా రైతుల ఆందోళన చెందారు. వాతావరణ మార్పులతో ఆందోళన మరింత ఎక్కువైంది. దీంతో రైతులు రోడ్డెక్కాల్సి వచ్చింది.

కేంద్రం తీరును నిరసిస్తూ పెన్షనర్ల భిక్షాటన

నినదిస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మోసపూరిత వైఖరిని నిరసిస్తూ పెన్షనర్లు ఏలూరు గాంధీ మైదానం నుంచి మెయిన్ రోడ్డులో శుక్రవారం భిక్షాటన నిర్వహించారు. తొలుత తమ న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఏలూరులో ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు ఎపిఆర్‌పిఎ ఆధ్వర్యాన పెన్షనర్లు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షులు విజిఎంవిఆర్.కృష్ణారావు మాట్లాడుతూ 2014 సెప్టెంబర్‌కు ముందు రిటైరైన వారికీ పెన్షన్ ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెన్షనర్లను మోసగిస్తుందన్నారు. పెరుగుతున్న ధరలు, అవసరాలకు అనుగుణంగా కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నగర అధ్యక్షుడు బి.జగన్నాధరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.అజయ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, సిఐటియు నేతలు వి.సాయిబాబా, ఎడ్ల నాగేంద్ర, ఆదినారాయణ, దుర్యోధన, చల్ల భుజ్జి, లక్ష్మణరావు, నరసింహమూర్తి, వరద వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న సిహెచ్.సుందరయ్య

తణుకు రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే దశలవారి పోరాటానికి సిద్ధంగా ఉండాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య పిలుపునిచ్చారు. ఆర్‌టిసి ఉద్యోగుల ఉమ్మడి జిల్లా వర్క్ షాప్ ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎపి ఎన్‌జిఒ హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసిలో ప్రయివేటీకరణ చర్యలు నిలిపి వేయాలని, ప్రయాణికుల అవసరాల కోసం కొత్త బసులు వేయాలన్నారు. అనంతరం ఆర్‌టిసి ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల ఓల్డ్ పెన్షన్‌ను వర్తింపజేయాలని, ఆర్‌టిసిలో అద్దె బస్సుల పెంపుదల ఆపాలని, ఆర్‌టిసి బస్సులు కొనుగోలు చేయాలని, ఉద్యోగులకు సంవత్సరాల తరబడి పేరుకుపోయిన బకాయిలు చెల్లించాలని వర్క్‌షాపులో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్.దొర, రాష్ట్ర కార్యదర్శి ఎం.అరుణకుమారి, జిల్లా గౌరవ అధ్యక్షులు పిఎస్.రావు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టివిఎస్.మూర్తి, ఎఎస్.రాయుడు, ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శ్రీనివాసు, ఎన్.సురేష్, తణుకు డిపో ఎస్‌డబ్ల్యుఎఫ్ గౌరవ అధ్యక్షులు కామన మునిస్వామి పాల్గొన్నారు.

కొనసాగిన సిపిఎం, సిపిఐ ప్రచార భేరి యాత్రలు

కలిదిండిలో..

టి.నర్సాపురంలో..

ప్రజాశక్తి - కలిదిండి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే వైసిపి, టిడిపి, జనసేన కొమ్ముకాయడం సహించరాని విషయమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. మండలంలోని చినతాడినాడ, సున్నంపూడి, దుంపలకొడుదిబ్బ, కొండంగి, యడవల్లి, మట్టగుంట, పెదలంక, రామకృష్ణాపురం, మూలలంక, భాస్కరరావుపేట, సంతోషపురం, గుర్వాయిపాలెం, కలిదిండి, వెంకటాపురం, ఆరుతెగలపాడు గ్రామాల మీదుగా సిపిఎం, సిపిఐ ప్రచార భేరి యాత్ర సాగింది. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నేత బండి వెంకటేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళరావు, నేతలు జక్కుల మహేష్, కె లెనిన్, పంతగాని ప్రకాష్, వీరవల్లి భాస్కరరావు, పెరుమాళ్ల సత్యన్నారాయణ, కుడుపూడి శ్రీనివాసరావు, దొంగ వెంకట సత్యనారాయణ, గద్దె అనిల్, చిన్నం శ్రీకాంత్, చీకటి సత్యనారాయణ, పైలా వెంకట రామకృష్ణ, సిపిఐ నాయకులు పుప్పాల కన్నబాబు పాల్గొన్నారు.

పోలవరం: అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మోడీ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని, దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు, గుత్త పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు, జిల్లా కమిటీ సభ్యులు శుక్లబోయిన రాంబాబు అన్నారు. ప్రచారభేరి యాత్రలో భాగంగా వారు మాట్లాడారు. ఈ నెల 26న యాత్ర ముగింపు సందర్భంగా నిర్వహించే సభలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు.

టి.నర్సాపురం: బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను అంతా ఖండించాలని సిపిఎం, సిపిఐ మండల నాయకులు తుమ్మల సత్యనారాయణ, సాకా గంగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని అల్లూరి సీతారామరాజునగర్‌లో ఆయన యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాత్ర మండలంతోపాటు చింతలపూడి లింగపాలెం మండలాల మీదుగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు వీరంకి వెంకట్రావు, మడకం కుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాట్రాయి: సిపిఎం, సిపిఐ ప్రచార భేరి మండల కేంద్రం చాట్రాయిలో సాగింది. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు రాయింకుల లక్ష్మణరావు, బత్తుల వెంకటేశ్వరరావు, చాట్ల పుల్లారావు, సిపిఎం మండల కార్యదర్శి కొలికి పోగు భాస్కరరావు, రంగారావు పాల్గొన్నారు.

బాలరాజుకు నిరసన సెగ

బోయవాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చడంపై గిరిజన సంఘ నేతలు, గిరిజనుల ఆందోళన

గిరిజన సంఘం నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అభివృద్ధి చెందిన బోయ వాల్మీకులను గిరిజన తెగల్లో కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజును శుక్రవారం అడ్డుకున్నారు. మండల కేంద్రంలో మసీదు వద్ద ఇఫ్తార్ విందులో పాల్గొనేందుకు వచ్చిన బాలరాజును గిరిజన సంఘం నాయకులు అడ్డుకున్నారు. బోయ వాల్మీకులను గిరిజనుల్లో కలపొద్దని, అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని, గిరిజనులకు అన్యాయం చేసిన వైసిపి గిరిజన ఎంఎల్ఎలు, ఎంపీ తక్షణమే రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఈ క్రమంలో వారికి ఎటువంటి సమాధానం చెప్పకుండానే ఎంఎల్ఎ హడావుడిగా అక్కడ నుంచి వెళ్లిపోయారు. సమాధానం చెప్పాలని ప్రతిఘటించిన గిరిజన సంఘం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానం ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు తీరని అన్యాయమన్నారు. తక్షణమే ఆ తీర్మానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు కారం భాస్కర్, నాయకులు కె.దుర్గారావు, ఎం.గంగరాజు, కుమారి, నాగమణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో సాయిష్ మృతితో..

ఏలూరు, పాలకొల్లులో విషాదఛాయలు

సాయిష్ తల్లిని ఓదారుస్తున్న ఎంఎల్ఎ ఆళ్ల నాని

వార్త మెయిన్‌లో..

కుటుంబ సభ్యులతో సాయిష్

2021లో అమెరికా వెళ్లేముందు హైదరాబాద్ ఎయిర్ పోర్టులో బంధువులు, స్నేహితులతో సాయిష్

ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాసంఘాల చలివేంద్రం కూల్చివేత దారుణం
సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురం హైస్కూల్ సెంటర్‌లో ఆర్‌అండ్‌బి స్థలంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చలివేంద్రాని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆ చలివేంద్రం పందిరిని పంచాయతీ సిబ్బంది పడవేసి ఎర్రజెండాను కింద పడేశారు. దీంతో ఆగ్రహించిన సిపిఎం నాయకులు ఆందోళన నిర్వహించారు. ఎర్రజెండా పడేసిన పంచాయతీ కార్యదర్శి వారి సిబ్బందిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రం ధ్వంసం చేయడం అన్యాయమని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సిపిఎం మండల నాయకులు తుమ్మల సత్యనారాయణ, అనుమోలు మురళి, పండు వీర భద్రుడు, మడకం కుమారి పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిన్నంపేట గ్రామంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎపిఒ లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో కూలీలకు, రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎపిఒకు ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొమ్ము ఆనందం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కొమ్ము ఆనందం మాట్లాడుతూ చిన్నంపేట గ్రామంలో నిరుపేద కూలీలు ఎక్కువగా ఉన్నారని, ఉపాధి హామీ చట్టం ద్వారానే జీవనాన్ని గడుపుతున్నటువంటి కుటుంబాలు చాలా ఉన్నాయని చెప్పారు. ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని, కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించి, రోజుకు రూ.500 వేతనం చెల్లించాలని, మజ్జిగ ప్యాకెట్స్ సరఫరా చేయాలని, పని ప్రదేశంలో టెంట్ ఏర్పాటు చేయాలని, పని ప్రదేశంలో మరణించిన కూలీకి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, పలుగు, పారా ఇప్పించాలని, కూలీలకు ప్లే స్లిప్స్ ఇవ్వాలని, వారానికి ఒకసారి కూలీల ఖాతాలో కూలి డబ్బులు జమ అయ్యేలాగా చూడాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరారు.

చేలోకి చేరిన నీరు

మునిగిన వరి చేలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని దొంతవరంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాల్లో సుమారు రెండు అడుగుల వరకు నీరు ముంచెత్తింది. గోదావరి జలాలను కోనాల కాలవ నుంచి రాచూరు పంట కాలువ మీదుగా తాగునీటి, చేపల చెరువుల కోసం వదులుతున్నారు. ఈ కారణంగా పంట కాలవ గట్లను తాగుతూ నీరు ప్రవహిస్తూ పక్కనే ఉన్న చేలల్లోకి చేరింది. దీంతో వరి కోతలు చేపట్టలేక పంటనష్టం తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాచురూ, సీతారాంపురం తదితర గ్రామాలకు చేపల చెరువుల కోసం నీటి ప్రవాహాన్ని పెంచేశారని,తమకు నీరు అవసరం లేదని వరి సాగుదారులు వాపోతున్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల దృష్టికి ప్రజాశక్తి తీసుకెల్లడంతో నీటి ప్రవాహాన్ని నియంత్రించారు.

సెప్టిక్ ట్యాంక్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సెప్టిక్ ట్యాంక్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. పసల సూర్యారావు అధ్యక్షతన సెప్టిక్ ట్యాంక్ వర్కర్స్ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం సెప్టిక్ ట్యాంక్ వర్కర్స్‌ని ఆదుకోని వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి షేక్ సుభాషిని మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంక్ వర్కర్స్‌కు ఆ ట్యాంకులు క్లీన్ చేసే ఆ వ్యర్థాన్ని బయట పడేయటానికి స్థలాలు ప్రభుత్వమే చూపించాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ విడుదల చేస్తే వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు వ్యాపారులు, ప్రజలు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం రాయితీతో వాహనాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏకలవ్య సెప్టిక్‌ట్యాంకు వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం కమిటీని ఎనిమిది మందితో ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా షేక్ సుభాషిని, పోలా రామకృష్ణ, కార్యదర్శి సేలం సూరిబాబు, కోశాధికారి జగన్నాథం, హరికృష్ణ ప్రసాద్, ఎనిమిది మందితో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పి.రామకృష్ణ, డి.సత్తిబాబు, ఎస్.సూరిబాబు, పి.చిన్న, జె.హరికృష్ణ, డి.వెంకటేష్, పి.కృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రామంలోని రైతులందరూ నవధాన్యాలు వేయాలని, దీంతో పంటకు కావాల్సిన పోషకాలు ఎక్కువగా లభిస్తాయని, భూసారం పెరుగుతుందని వైసిపి నాయకులు చంద్రు కిషోర్‌కుమార్, గిరి భోగారావు సూచించారు. మండలంలోని రాఘవపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగం వారు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకంతో అధిక ఖర్చుతో పాటు భూమిలోని సారం తగ్గుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో పాటు రైతులకు అధిక దిగుబడి వస్తుందరన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్నబాబు, రైతులు, మహిళా రైతులు, కాంతమ్మ, నాగరాజు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని కొత్త పట్టిసీమలో వైసిపి నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ నవధాన్యాల పంపిణీ నిర్వహించారు. గ్రామ సర్పంచి మైగాపుల విజయదుర్గ మాట్లాడుతూ గ్రామంలో రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని, పచ్చిరొట్టగా 30 రకాలతో కూడిన నవధాన్యాలు వేయాలని, ప్రకృతి వ్యవసాయమే చేయాలని చెప్పారు. అనంతరం నవధాన్యాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుబ్బలక్ష్మి, ఐ సిఆర్‌పిలు, గ్రామపెద్దలు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ దాడులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు ఎక్సైజ్ శాఖ కార్యాలయ సిబ్బంది, జిల్లా టాస్క్ ఫోర్స్ శుక్రవారం సంయుక్తంగా ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు గ్రామంలో దాడులు చేశారని ఎక్సైజ్ శాఖ భీమడోలు ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ దాడుల్లో ఒక మహిళ ఐదు లీటర్ల నాటు సారాతో పట్టుబడగా భీమడోలు కోర్టుకు హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. అనంతరం దొరసానిపాడు గ్రామ సచివాలయం వద్ద గ్రామ ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం, నాటు సారా వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించామన్నారు. కేసుల్లో పట్టుబడినవారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కేంద్రీయ విద్యాలయానికి అనుమతి ఉందా...లేదా..!

టిడ్కో నిర్మాణాలు పూర్తయ్యేదెప్పుడు?
మెప్మాలో వసూళ్ల దందాపై చర్యలేవీ?
వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి - నూజివీడు

కేంద్రీయ విద్యాలయం ఎప్పుడు ప్రారంభమవుతుందని, టిడ్కో ఇళ్లు ఇంకెప్పుడు ఇస్తారని టిడిపి కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికార వైసిపి కౌన్సిలర్లు సతమతమయ్యారు. నూజివీడు మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ త్రివేణిదుర్గ అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం రసాభాసగా జరిగింది. ఎజెండా, టేబుల్ అజెండాలోని పలు అంశాలను డిఇఇ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది చదివి సభ్యులకు వివరించారు. నూతనంగా నిర్మిస్తున్న సమావేశ మందిరంలో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సెంట్రల్ ఎసిలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ ప్రతిపాదనలపై మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ అభ్యంతరం చెప్పారు. సెంట్రల్ ఎసిల స్థానంలో గతంలో పాత సమావేశ మందిరానికి సంబంధించిన ఎసిలను అమర్చాలని కౌన్సిల్‌లో తీర్మానించారు. ఎంప్లాయిస్ కాలనీలో మున్సిపల్ నిధులు రూ.90 లక్షలతో ఏర్పాటు చేసిన కేంద్రీయ తాత్కాలిక భవనాలు ఎప్పుడు వినియోగంలోకి వస్తాయని, అసలు కేంద్రీయ విద్యాలయానికి అనుమతి ఉందా, లేదా అని ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ ప్రశ్నించారు. దీనిపై కో-ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణకుమార్ స్పందిస్తూ అనుమతి రాకుండా ఆబ్జర్వర్లు ఎలా వస్తారన్నారు. కేంద్రీయ శాశ్వత భవనాల నిర్మాణానికి ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ఏడు ఎకరాలను కేటాయించినట్లు చెప్పారు. కేంద్రీయ విద్యాలయం నూజివీడులో అద్దెప్పుడు ఈ ఏడాది ఉంటాయని అనుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఫ్లోర్‌లీడర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ టిడిపి హయాంలో ప్రారంభమైన టిడ్కో ఇళ్ల నిర్మాణాలు నాలుగేళ్లు అయినా పూర్తవలేదని, ఆ నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయని ప్రశ్నించారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ టిడ్కో నిర్మాణాలు 80 శాతం పూర్తయ్యాయని, నిర్మాణ పనులు ప్రస్తుతం జరుగుతూనే ఉన్నాయని చెప్పారు. ఫేజ్-2 కింద నూజివీడు ఎంపికవ్వడంతో నిర్మాణాలు జాప్యం జరుగుతున్నాయన్నారు. జులై నుంచి ఫేజ్-2 పనులు ప్రారంభమవుతాయని, అప్పుడు గృహ నిర్మాణ పనులతో పాటు రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎజెండాలో పెట్టాల్సిన అంశాలను కూడా టేబుల్ అజెండాలో పెట్టడం పట్ల టిడిపి కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆసరా అమలులో పలు అవకతవకలు జరుగుతున్నాయని టిడిపి మహిళా కౌన్సిలర్లు ఆరోపించారు. ఈ సమావేశంలో కో-ఆప్షన్ సభ్యుడు ప్రసాదరావు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బహుమతులతో విద్యార్థులు

'చైతన్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు వంటి గ్రామీణ ప్రాంతాల్లో చైతన్య విద్యాసంస్థలను ఏర్పాటు చేసి ఉన్నత స్థాయిలో విద్యాబోధన చేస్తున్న యాజమాన్యం సేవలు అభినందనీయమని భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు కె.రామయ్య తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పోటీల్లో ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాలను సాధించిన నేపథ్యంలో వారికి అభినందన కార్యక్రమాన్ని శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు వారికి సర్టిఫికెట్లు అందించడంతో పాటు ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.సోహిని మాట్లాడుతూ రెండు దశలుగా నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు ఈ సంవత్సరం కూడా 60 శాతం అర్హత సాధించారని తెలిపారు. ద్వితీయ స్థానాన్ని ఆరో తరగతి విద్యార్థి వి.నిఖిల్ సాధించారన్నారు. తృతీయ స్థానాన్ని మూడో తరగతి విద్యార్థి ఎన్.సుదీప్, నాలుగో స్థానాన్ని ఐదో తరగతి విద్యార్థి వి.పవిత్ర తో పాటు మరొక విద్యార్థి సంయుక్తంగా సాధించారన్నారు. వీరితోపాటు 28 మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు లభించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రముఖులు మద్దుల రాజా, చైతన్య విద్యాసంస్థల రీజనల్ ఇన్‌ఛార్జి సుంకర పార్థసారధి, సమన్వయకర్త సిహెచ్.ఉదయ్‌కిరణ్, అకాడమిక్ డీన్ భార్గవ కిరణ్, ఐఎన్‌టిఎస్‌ఒ ఇన్‌ఛార్జి శామ్యూల్, ఎఒ ముఖేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటం మానవత్వం అని టిడిపి నేత ఆకుమర్తి రామారావు అన్నారు. మండలంలోని ప్రగడవరంలో తమ్మిశెట్టి సరోజిని ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. బాధిత కుటుంబానికి రూ.పదివేల, బట్టలు అందించారు. మాజీ ఎంపీ మాగంటిబాబు నిత్యావసర సరుకులు, బట్టలు అందించారు. నిమ్మల ముత్తయ్య బియ్యం కట్ట అందించారు. ఈ కార్యక్రమంలో ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిటిసి మాజీ సభ్యులు కనమతరెడ్డి రాజశేఖర్ రెడ్డి, రెండో వార్డు మెంబర్ జగ్గవరపు శ్రీనివాసరెడ్డి, నాయీ బ్రాహ్మణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పెర్ల నాగరాజు, ఎంపిటిసి మాజీ సభ్యులు కొనకల్ల వీర్రాజు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

స్పందన ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి జివివి.సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలల్లో స్పందనలో వచ్చిన ఫిర్యాదులు వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలపై శాఖలవారిగా సమీక్షించినట్లు ఆయన తెలిపారు. విద్యాశాఖ, ఐసిడిఎస్‌లలో నాడు-నేడు పనుల పురోగతిపై, గ్రామ పంచాయతీలో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల ప్రగతిపై, వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖల పనితీరు, ప్రజల ఆరోగ్యం పట్ల ఆరోగ్య శాఖ చేపడుతున్న చర్యలపై సమీక్షించినట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జెవి.సుబ్బారావు, మండల అభివృద్ధి అధికారి ఎన్‌టి.స్వామి, విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి, ఎఒ డి.ముత్యాలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కె.గంగరాజు, పిఆర్ ఎఇ సంపత్ కుమారి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

గుండుగొలను సొసైటీ ఛైర్‌పర్సన్‌గా భాస్కర్

భీమడోలు : గుండుగొలను విశాల సహకార పరపతి సంఘం ఛైర్‌పర్సన్‌గా తనను కొనసాగిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని వివివి.భాస్కర్ తెలిపారు. ఈ మేరకు డబ్ల్యూపి నెంబర్ 9462 / 2023, ఐఎ నెంబర్ 1/ 2023 ద్వారా హైకోర్టు ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు. ఇప్పటికే జిల్లాస్థాయిలో వివిధ అంశాల అమలులో ప్రథమ స్థానంలో నిలిచిన గుండుగొలను విశాల సహకార పరపతి సంఘం అదే ఒరవడి కొనసాగించేందుకు తన పాలక మండలి, సిబ్బంది సహాయ సహకారాలతో కృషి చేస్తానని ఆయన తెలిపారు.

'వికాస్' ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



జంగారెడ్డిగూడెం : ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దేశం అభివృద్ధి చెందాలంటే సర్వ మతాలు కలయికతో పాటు, మతసామరస్యాన్ని కాపాడుకోవటం మనందరి కర్తవ్యమని, ఇస్లాంలోని మహమ్మద్ ప్రవక్త బోధించిన క్రమశిక్షణ, సేవా, దాతృత్వం వంటి విషయాలు నేటికీ అందరికీ ఆచరణీయమని వికాస్ విద్యా సంస్థల ఛైర్మన్ వి.జగన్ అన్నారు. శుక్రవారం వికాస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో రంజాన్ మాస ఉపవాసాల నేపథ్యంలో ముస్లిం సోదరులు సుమారు 300 మందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక బిలాల్ మసీదు ఆవరణలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి జగన్ మాట్లాడుతూ దేశ సమైక్యత సమగ్రతను కాపాడుకోవాలన్నారు. నేటి యువతరం మత సమరస్యాన్ని ఆచరించాలని తెలిపారు. పట్టణంలోని ఏ మంచి కార్యక్రమానికి అయినా రానున్న కాలంలో వికాస్ విద్యాసంస్థల సహకారం ఉంటుందని తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషం కలిగించిందన్నారు. ముస్లిం సోదరుల ందరికీ ఈద్ ముబారక్, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థలు కరస్పాండెంట్ సౌజన్యలక్ష్మి, డీన్ కె.సత్యం, సీనియర్ సోషల్ యాక్టివిస్ట్ నేలటూరి మోహన్, ప్రిన్సిపల్ కిషోర్, ఎజిఎం కె.సురేష్, ధనరాజు, చిట్టిబాబు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మసీద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఆయనతో పాటు మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, టి.నరసాపురం జెడ్‌పిటిసి సభ్యులు సూరిబాబు, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, వైస్ ఎంపిపి మోహనరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : రంజాన్ నెలలో ఉపవాస దీక్షలున్న ముస్లిం సోదరులకు శుక్రవారం రాత్రి ద్వారకాతిరుమల గ్రామంలో చెరువు వీధిలో ఉన్న మసీదులో టిడిపి బిసి సెల్ అధ్యక్షుడు శ్రీ రేవూరి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు మట్టపర్తి రూపేష్‌కుమార్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మండలంలోని ముస్లిం సోదరులకు రంజాన్ శుభకాంక్షలు తెలిపారు.

భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి



నిర్మాణాలను తొలగిస్తున్న జెసిబి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామపంచాయతీ పరిధిలో భవన నిర్మాణాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని గుండుగొలను గ్రామపంచాయతీ కార్యదర్శి వి.మురళి కోరారు. గ్రామ పరిధిలోని గణేష్ నగర్ కాలనీలో 28/12 సర్వే నెంబర్‌లో ఉన్న మూడు సెంట్ల స్థలం విషయం వివాదాస్పదంగా ఉంది. ఈ విషయమై కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. సదరు వివాదాస్పద స్థలంలో ఒక భవన నిర్మాణదారుడు భవన నిర్మాణాన్ని చేపట్టారు. స్థలం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున భవన నిర్మాణం చేపట్టరాదని గ్రామపంచాయతీ పలుమార్లు నిర్మాణదారుడికి నోటీసులు జారీ చేసింది. అయినప్పటికీ వీటిని పట్టించుకోని నిర్మాణదారుడు నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. దీనిపై స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు పోలీసుల సహకారంతో వివాదాస్పద స్థలంలో కొనసాగుతున్న భవన నిర్మాణాలను శుక్రవారం తొలగించారు. సామగ్రిని స్వాధీన పరుచుకున్నారు. ఈ విషయమై గుండుగొలను గ్రామపంచాయతీ కార్యదర్శికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భీమడోలు, సూరప్పగూడెం, పూళ్ల గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎన్.ఠాగూర్, ఎం.ముత్తయ్య, సూర్య సహకారాన్ని అందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో కరోనా కేసులు కలకలం సృష్టించటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి డి.ఆశా సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో మండలంలోని 16 గ్రామాల మండల శాఖ అధికారులతో, గ్రామ శాఖ అధికారులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ నిర్మాణ దశలో ఉన్న రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, పిహెచ్‌సి భవనాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కరోనా కేసుల నేపథ్యంలో ప్రజలు భయభ్రాంతులకు గురి కావొద్దని, శానిటైజర్, మాస్కు ధరించి, వ్యక్తిగత దూరం పాటించాలని కోరారు. ఈ సమావేశంలో పిహెచ్‌సి వైద్యులు ఎం.కిరణ్‌కుమార్, కరిముల్లా, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ నూతన అధ్యక్షులుగా సత్యనారాయణ

భీమడోలు : భీమడోలు ఉప ఖజానా శాఖ పరిధిలో భీమడోలు కేంద్రంగా పనిచేస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘ నూతన అధ్యక్షులుగా పంచకర్ల సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఇప్పటివరకు పనిచేసిన ఎవి.రామ్మోహన్‌రావు చనిపోయిన కారణంగా ఏర్పడిన ఖాళీని పంచకర్ల సత్యనారాయణతో భర్తీ చేసినట్లు సంఘ నిర్వాహకులు తెలిపారు. అప్పటి మిగిలిన పాత కార్యవర్గం యధావిధిగా పనిచేస్తుందని చెప్పారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పంచకర్ల సత్యనారాయణను పలువురు విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రముఖులు సత్కరించారు.

సత్ఫలితాలిస్తున్న సచివాలయ వ్యవస్థ : ఎంఎల్‌ఎ డిఎన్‌ఆర్

ప్రజాశక్తి - కైకలూరు

ప్రజలకు ప్రభుత్వ సేవలు ఇంటివద్దకే అందించే ఉద్దేశంతో జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ నూటికి నూరుపాళ్లు సత్ఫలితాలను ఇస్తుందని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అడవి వెంకటకృష్ణమోహన్, మండల ప్రత్యేక అధికారి (పీడీ-డ్వామా) అరవపల్లి రాము ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గ్రామ సచివాలయ సహాయకుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలో దిగ్విజయంగా సాగడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలను సమాయత్తం చేస్తూ సమన్వయంతో పనిచేసిన ఎంపిపి కృష్ణను అభినందించారు. రానున్న కాలంలో మరింత కష్టించి ప్రజల కోసం పని చేయాలని సచివాలయ సహాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బత్రాజు శివాజీ, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, తహశీల్దార్ మురళీకృష్ణ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామలింగేశ్వరరావు, డ్వామా ఎపిఒ శరణ్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఏలూరు నగరం, ఎన్.టి.ఆర్.కాలనీ, కోటేశ్వర దుర్గాపురం గ్రామ కాపురస్తులైన సంబంగి జనార్ధనరావు, తండ్రి: రామ్మోహన్ అను నాకు క్రయ దస్తావేజు నెం. 2921/2019 కలవు. ఈ దస్తావేజులను జిరాక్సు నిమిత్తం ది.08-04-2023వ తేదీన ఇ.సి. తీయించుకొనుటకు మా ఇంటి వద్ద నుండి ఏలూరు రిజిస్ట్రారు ఆఫీసు వద్దకు బైక్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినవి. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

ఎస్.జనార్ధనరావు
సెల్: 93472 94071

పోయినవి

ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, మినీ బైపాస్ రోడ్, రామకృష్ణాపురం, H.No. 22D-2-14 కాపురస్తులు రెడ్డి నాగేశ్వరరావు గారి భార్య రెడ్డి పద్మావతి గారి పేరున ఏలూరు R.O లో R.S. No. 1017, Extent of 292 sq.yds డాక్యుమెంట్ నెంబర్ 852/1989 గా రిజిస్టర్ కాబడినది. సదరు ఆస్తి గల దస్తావేజును జిరాక్స్ కాపీల నిమిత్తము మా ఇంటి నుండి అంబికా థియేటర్ సెంటర్‌కు మా ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినవి. ఎంత వెతికినా కనిపించలేదు. కావున ఈ పేపర్ ప్రకటన చూచి ఎవరికైనా దొరికినచో ఈ సెల్ నెంబర్‌కు **8977809189** లేదా పైన తెలిపిన అడ్రస్‌కు అందచేయగలరు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

ప॥గో॥జిల్లా, కాళ్ళ మండలం, కోపల్లె గ్రామ కాపురస్తులు దంతులూరి కృష్ణంరాజు, తండ్రి: సీతారామరాజు యొక్క భీమవరం సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టరు కాబడిన దస్తావేజు నెం. 1025/1998, తేదీ 26-03-1998, నా పేరు మీద ఉన్న ఒరిజినల్ దస్తావేజులు కోపల్లెలో మా ఇంటి దగ్గర నుండి ది.20-04-2023వ తేదీన మోటారు సైకిల్ పై జిరాక్సు నిమిత్తం వెళ్ళు చుండగా మార్గమధ్యలో పడిపోయినవి. పరిసర ప్రాంతంలో వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.

దంతులూరి కృష్ణంరాజు
డో.నెం. 4-5, కోపల్లె, కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా. సెల్: 77318 52349

లబ్ధిదారులకు పట్టాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం సంతోషకరమని ఎంఎల్‌ఎ విఆర్.ఎలిజా అన్నారు. మండలంలోని లక్కవరం, టెక్కివారిగూడెం, పంచాయతీల్లో లబ్ధిదారులకు శుక్రవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. లక్కవరంలో 33 మందికి, టెక్కివారిగూడెం గ్రామంలో 65 మందికి, జగనన్న ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఎలిజా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టెక్కివారిగూడెం సర్పంచి గురజాల ధర్మావతి పార్థసారథి, వైసిపి నాయకులు మాల్నీడి బాబి, లక్కవరం సర్పంచి వెంకటరమణ, ఎంపిపి కొదమ జ్యోతి, జెడ్‌పిటిసి సభ్యులు పోలినాటి బాబ్జి, వైసిపి మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, మండల సచివాలయ కన్వీనర్ గురజాల పార్థసారథి, తహశీల్దార్ స్లీవ్‌జోజి, డిటి రమేష్ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటం మానవత్వానికి నిదర్శనమని జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు అన్నారు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన చిలకా రామకృష్ణకు రూ.ఐదు వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ బాధితుడికి వైద్యం నిమిత్తం టిడిపి అండగా ఉంటుందన్నారు. 28 సంవత్సరాల వయసులోనే కిడ్నీ వ్యాధికి గురైన యువకుడిని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ ఉపాధ్యక్షుడు పడమటి శివ, టిడిపి బిసి నాయకులు పేరుబోయిన సూరిబాబు, టిడిపి మాజీ మండల తెలుగు రైతు అధ్యక్షులు ఘంటా సతీష్, దవులూరి కృష్ణ, మాజీ సర్పంచి గుమ్మళ్ల బాలరాజు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు పశ్చిమ గోదావరి జిల్లా, వెంకట్రామన్న గూడెం గ్రామ కాపురస్తులు **శ్రీపతి వెంకట భవాని ప్రసాద్ గారి భార్య శ్రీపతి శిల్ప కళ అనే జుజ్జవరపు శిల్ప కళ** నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా..,

నా క్లయింటుకు వెంకట్రామన్న గూడెం గ్రామంలో ఆర్.ఎస్.నెం. 125/6 గల య.4-40 సెంట్లు భూమికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు నెం. 2309/2003 నా క్లయింటు జిరాక్సు తీయించుటకు బ్యాగులో పెట్టుకుని జిరాక్సు షాపు దగ్గరికి వెళ్ళి చూసే సరికి సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎక్కడో పడిపోయినవి. కావున యావన్మందికి బహిరంగంగా తెలియజేయునది ఏమనగా ఎవరికైనా సదరు దస్తావేజులు దొరికిన ఎడల వాటిని ఈ క్రింది అడ్రసుకు అందచేయవలనని అటులకాక ఎవరైనా వాటిని అక్రమార్జన కోసం దుర్వినియోగ పర్చిన అవి చట్టప్రకారం చెల్లనేరవని మరియు చట్టప్రకారం శిక్షార్హులు అగుదురు అని తెలియజేయడమైనది.

మీసాల రామకృష్ణ, న్యాయవాది,
తాడేపల్లిగూడెం. సెల్: 80084 33415

పోయినవి

తెలంగాణ రాష్ట్రము, వరంగల్ జిల్లా, వడ్డేపల్లి గ్రామం హౌస్ నెంబర్ 2-9-395, స్నేహ నగర్ కాపురస్తులు **రాచిరాజు రామమోహన్‌రావు గారి భార్య రాచిరాజు నళిని** గారి పేరున ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, గవరవరం గ్రామంలో **R.S. No. 40/2, Plot No. 81** ఇళ్ల స్థలం ఆమె భర్త నుండి ఆమె 2021 సంవత్సరం వట్లూరు సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో 240/2021 డాక్యుమెంట్ నెంబర్‌గా రిజిస్టర్ పొందినది. సదరు దస్తావేజునకు లింకు దస్తావేజుగా ఆమె భర్త పేరున (రాచిరాజు రామమోహన్‌రావు) డాక్యుమెంట్ నెంబర్ 5321/1984 ఏలూరు ఆర్.ఓ.లో రిజిస్టర్ కాబడినది. సదరు 2021 సంవత్సరంలో నా పేరున రిజిస్టర్ కాబడిన ఆస్తిని కొలతలు కొలిపించే ప్రక్రియ నిమిత్తం లింక్ దస్తావేజుని జిరాక్స్ తీయపించి సెయింట్ థెరిసా డిగ్రీ కాలేజ్ నుంచి గవరవరంకు ఆటోలో తిరిగి వస్తుండగా నా ఆస్తికి లింక్ దస్తావేజు అయిన **డాక్యుమెంట్ నెంబర్ 5321/1984** ఏలూరు ఆర్.ఓ మిస్ అయినది. ఎంత వెతికిన దొరకలేదు. కావున ఈ ప్రకటన చూసిన వారికి ఎవరికయినా దొరికినచో మా సెల్ నెంబర్‌కు తెలుపగలరు.

సెల్: 9849388946

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE :: ELURU
E.P.NO. 89/2018
O.S.NO. 376/2015

Between:
Cheekati Vara Prasad ...*Decree Holder*
VS
Kalneedi Venkateswara Rao ...*Judgement Debtor*

AUCTION PUBLICATION

WHEREAS the DHR obtained money decree against the JDR above named and brought the below mentioned schedule property to sale in the above Execution proceedings.

WHEREAS the Honorable Principal Senior Civil Judge, Eluru fixed the date **i.e. 04-05-2023 for the sale of the schedule property by public auction in the Court,** by ordering publication of the sale for notice to the intending bidders in order to participate in the auction.

TAKE NOTICE that the persons who intends to participate in the auction for purchase of the schedule mentioned property can appear before the Honorable Court on 04-5-2023 at 10.30 A.M. onwards and participate in the auction.

SCHEDULE

All the part and parcel of the Landed property situated in Yepugunta Village of T.Narasapuram Mandal, Chintalapudi Sub-Registry, in R.S.No.166 in an extent of Ac.2-57 cents out of Ac.7-29 cents bounded by:
East: Landed property Kalneedi Subba Rao.
South: Landed property belongs to Lavanukala Gangadhara Rao.
West: Road. ***North:*** Landed property belongs Kurasam Venkateswara Rao.

Within the above boundaries an extent of Ac.2-57 cents out of Ac.7-29 cents with all easementry rights.

DHR Value: Rs.5,00,000/-
Amin Value: Rs.30,06,000/-
J.D.R. Value Not Stated.
DEVULAPALLI SREE RAM
D.KRISHNA SASTRY
Advocates for DHR
Eluru, Eluru Dist.
Eluru,
20-04-2023.